ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు జిల్లా వార్తలు
ఆదివారం 2 జూన్ 2024



హంద్రీనీవా ప్రాజెక్టు మల్యాల పీఎస్-1 ప్రధాన పంప్‌హౌస్

బకాయిలు రూ.4,732.88 కోట్లు

విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ.4,732.88 కోట్లు. హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టుతో పాటు ఏపీఎస్ఐడీసీ ఎత్తిపోతల పథకాలు కోసం వినియోగించిన విద్యుత్‌కు జలవనరుల శాఖ ఒక్కటే రూ.3,987.62 కోట్లు చెల్లించాలి. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఐదేళ్లలో ఒక్కపైసా కూడా చెల్లించలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఒక్కటే ఆ స్థాయిలో ఉంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రూ.వేల కోట్లు బకాయిలు పేరుకుపోవడం వల్ల ఒకటో తేదీనే ఖాతాలో జమ కావాల్సిన వేతనాలు 14, 15వ తేదీల వరకు ఆగాల్సి వస్తుందని ఏపీడీసీఎల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ శాఖ విధించే అపరాధ రుసుంతో ఓ ప్రాజెక్టు నిర్మించవచ్చని సాగునీటి నిపుణులు అంటున్నారు.

- ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయి
- హంద్రీనీవా ప్రాజెక్టు బకాయి ఒక్కటే రూ.3,602.67 కోట్లు
- ఐదేళ్లలో ఒక్కపైసా ఇవ్వని జగన్ ప్రభుత్వం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పేరుకుపోయిన బకాయిలు
- నివేదికలు పంపుతూనే ఉన్న విద్యుత్ శాఖ



కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. జగన్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా విద్యుత్ బిల్లులు, బకాయిలు చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో కరువు కరువు నివారణ లక్ష్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలి. శ్రీశైలం ఎగువన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద 216.30 కిలోమీటర్లు ప్రధాన కాలువ, 8 పంపింగ్ స్టేషన్లు నిర్మించారు. 3,850 క్యూసెక్కులు లిఫ్ట్ చేసేందుకు ప్రతి పంపింగ్ స్టేషన్‌లో 12 విద్యుత్తు పంపులు (మోటర్లు) ఏర్పాటు చేశారు. కృష్ణా జలాలు కర్నూలు జిల్లా దాటి అనంతపురం జిల్లాకు చేరాలంటే 8 పంపింగ్ స్టేషన్లు ఏకకాలంలో పని చేయాలి. అలాగే తుంగభద్ర వరద జలాలు ఎత్తిపోసి మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీరు అందించే లక్ష్యంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-1, స్టేజ్-2 కింద 12 ఎత్తిపోతల పథకాలు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పరిధిలో 79 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. విద్యుత్ సరఫరా లేకపోతే ఒక్క చుక్క నీరు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో కొన్ని నెలలు ఆలస్యమైనా విద్యుత్తు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక కరెంటు బిల్లులకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం ఎత్తిపోతల పథకం

విద్యుత్ బకాయిల వివరాలు రూ.కోట్లల్లో

ప్రభుత్వ శాఖ	బకాయి
హంద్రీనీవా ప్రాజెక్టు	3,602.67
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	162,20
ఏపీఎస్ఐడీసీ, ఇతర లిఫ్టులు	222.75
ఆర్‌డబ్ల్యూఎస్	168.09
పంచాయతీలు	508.50
మున్సిపాలిటీలు	21.26
ఇతర శాఖలు	47.42
మొత్తం	**4,732.88**

అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి

హంద్రీనీవా ఒక్కటే కాదు.. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, ఏపీఎస్ఐడీసీ, గ్రామీణ తాగునీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్), పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు వివిధ 37 ప్రభుత్వ శాఖ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కటే రూ.4,732.88 కోట్లు ప్రభుత్వ విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి అప్పుడప్పుడు బిల్లులు వస్తున్నా.. జలవనరుల శాఖ పర్యవేక్షణలోని ప్రాజెక్టుల నుంచి ఏళ్లు గడుస్తున్న బిల్లులు అందడం లేదు. ఈ క్రమంలో ప్రతి నెల రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.



మాల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి ఎత్తిపోస్తున్న కృష్ణా జలాలు

హంద్రీనీవా బకాయి రూ.3,602.67 కోట్లు

హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా మాల్యాల, బ్రహ్మణకొట్కూరు, సెట్టిపల్లి, కృష్ణగిరి, కంబలపాడు, లక్కసారగం, నునుసురాళ్ల, రాగులపాడు, అంకంపల్లి వద్ద 8 పంపింగ్ స్టేషన్లు నిర్మించారు. 2019-20లో 42 టీఎంసీలు, 2020-21లో 37 టీఎంసీలు, 2021-22లో 26.65 టీఎంసీలు, 2022-23లో 26 టీఎంసీలు, 2023-24లో దాదాపుగా 23 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోశారు. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు సుమారుగా రూ.23-25 కోట్లు విలువైన విద్యుత్ ఖర్చు అవుతుంది. ఈ ఏడాది చిత్తూరు జిల్లా కుప్పానికి తీసుకెళ్లామని సీఎం జగన్ గొప్పగా చెప్పుకున్నారు. వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక విద్యుత్ బిల్లు చెల్లింపు కోసం నిధులు మంజూరు చేయలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.670.01 కోట్లు, 2020-21లో 834.80 కోట్లు, 2021-22లో 821.39 కోట్లు, 2022-23, 2023-24 రెండేళ్లలో 1,276.34 కోట్లు కలిపి ఐదేళ్లలో రూ.3,602.67 కోట్లు విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో దాదాపు రూ.100-150 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని అంచనా. ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో అదే స్థాయిలో డిస్కమ్స్ కూడా ఎన్‌టీపీసీ వంటి విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టాల్సి వచ్చిందని ట్రాన్స్‌కో ఇంజనీర్లు అంటున్నారు. ఉగ్యోగులకు 14,15వ తేదీల వరకు జీతాలు అందని పరిస్థితి ఏర్పడింది. తన 30 ఏళ్ల సర్వీస్‌లో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని, టాన్స్‌కో చరిత్రలోనే ఆ దుస్థితి లేదని ఏపీ ట్రాన్స్‌కో ఇంజనీరు ఒకరు పేర్కొనడం కొసమెరుపు.



ప్రభుత్వ బకాయిలు వాస్తవమే

హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టు సహా వివిధ శాఖలు నుంచి విద్యుత్ బిల్లులు రూ.4,732.88 కోట్లు బకాయి ఉన్నమాట నిజమే. ప్రతి నెల బకాయిలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. అలాగే బకాయి ఉన్న ఆయా శాఖలకు నోటీసులు కూడా జారీ చేశాం.

– ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ, కర్నూలు

నిఘా నీడలో ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత
- 4న రాయలసీమ యూనివర్సిటీ మార్గంలో ట్రాఫిక్ బంద్
- అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాలకే అనుమతి
- ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు, జూన్ 1: నగరంలోని రాయలసీమ యూనివర్సిటీలో అన్ని రకాల భద్రత ఏర్పాట్ల మధ్య ఈ నెల 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. శనివారం కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లించే జాతీయ రహదారులను ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించామని అన్నారు. కర్నూలు ప్రజలు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, డీఎస్పీ విజయశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, తాలుకా సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ గౌతమి ఉన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా: ● నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి పుల్లారెడ్డి కళాశాల, రాయలసీమ యూనివర్సిటీ (నంద్యాల రోడ్డు)కు టోల్‌గేట్ వరకు మార్గం అంతా బంద్ ఉంటుంది. ఈ మార్గంలో ఏ వాహనదారుడికి అనుమతి లేదు. కేవలం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల లెక్కింపు విధులలో ఉండే సిబ్బంది, సంబంధిత అధికారులు, నియోజకవర్గ అభ్యర్థులు, వారి ఏజెంట్ల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

● నంద్యాల చెక్‌పోస్టు నుంచి బి.తాండ్రపాడు వెళ్లేవారు, నంద్యాల వైపు వెళ్లే వారు, నన్నూరు వైపు వెళ్లేవారు బద్రినాథ్ నగర్, మారుతి మెగా సిటీ, శిల్పాటౌన్‌షిప్ కాలనీలకు చెందిన వారు తమ మార్గాన్ని మార్చుకోవాలి. చెక్‌పోస్టు, రాయలసీమ యూనివర్సిటీ వెళ్లే జాతీయ రహదారిలో కాకుండా దిన్నెదేవరపాడు, మిలిటరీ క్యాంటీన్, బిర్లా జంక్షన్, జోహరాపురం రోడ్డు మార్గాలను ఎంచుకోవాలి.

● నంద్యాల వైపు నుంచి కర్నూలు పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నన్నూరు టోల్‌గేటు, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండు వైపు లేదా కర్నూలు పట్టణంలోకి రావాలి.

● హైదరాబాదు వైపు నుంచి వచ్చే వాహనాలు యథావిధిగా కర్నూలు వైపు రాకపోకలు సాగించవచ్చు.

● నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, విజయవాడకు కర్నూలు వైపు నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు యథావిధిగా రాకపోకలు జరుగుతాయి.

● డోన్ వైపు కర్నూలు నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు యథావిధిగా రాకపోకలు సాగించవచ్చు.



కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ



కర్నూలు నగరంలోని గోశాలలో..



ఎమ్మిగనూరులోని సోగనూరు రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం




బళ్లారి చౌరస్తాలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

జై హనుమా..

కర్నూలు(కల్చరల్), జూన్ 1: హనుమజ్జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. జై హనుమాన్, జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామివారికి సహస్ర ఘటాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. అభిషేకాలతో పూజలు ప్రారంభమయ్యాయి. వేద, సుందరకాండ, మన్యుసూక్త హోమాలు, శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర జపాలు, హోమం, శ్రీరామ పట్టాభిషేకం, బలిహరణ, పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృద కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు నగరంలోని జగన్నాథ గట్టు, ఈ.తాండ్రపాడులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆంజనేయస్వామికి అభిషేకములు, అర్చనలు, ఆకుపూజలు చేపట్టారు. మహిళలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. గుత్తిరోడ్‌లోని సూర్యభగవానుడి ఆలయంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి మద్యం బంద్

- మూడు రోజుల పాటు విక్రయాలు నిలిపివేత
- ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రభుత్వ నిర్ణయం



కర్నూలు(అర్బన్), జూన్ 1: అసెంబ్లీ, లోక్ సభ, ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు, అల్లర్లు చెలరేగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా 3 రోజుల పాటు వైన్ షాపులను బంద్ చేయాలని ఆదేశించింది. ఈనెల 4 కౌంటింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 3 నుంచి 5వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలను మూసి వేయాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. డీజీపీ ఆదేశాలతో జిల్లా ఎక్సైజ్ అధికారులు అందుకు తగ్గట్టుగా మద్యం దుకాణాల సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు అంటున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని జిల్లాల సిబ్బందికి పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు.

శారీరక రుగ్మతల వల్లే సైకో సోమాటిక్ వ్యాధులు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.రాధికరెడ్డి

- డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ రిజిస్ట్రార్ రాధికరెడ్డి
- కర్నూలులో ప్రారంభమైన దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: మానసిక ఒత్తిడితో శరీరంలో మార్పులు, శారీరక జబ్బుల వల్ల మానసిక సమస్యల వల్ల సైకో సోమాటిక్ వ్యాధులు ఎక్కువవుతున్నాయని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ రిజిస్ట్రార్ డా.వి.రాధికారెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని మౌర్యాఇన్ హోటల్‌లో రెండు రోజుల దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సును రిజిస్ట్రార్ డా.రాధికా రెడ్డి, కర్నూలు ఎంపీ డా.సంజీవకుమార్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.రాధికారెడ్డి మాట్లాడుతూ సైకో-సోమాటిక్ వ్యాధులు మహిళల్లో ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. హార్మోన్ల ఇన్ బ్యాలెన్స్ వల్ల ఈ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఈ వ్యాధిని గుర్తించి త్వరగా వైద్యం అందించాలన్నారు. కర్నూలు ఎంపీ డా.సంజీవకుమార్ మాట్లాడుతూ



మాట్లాడుతున్న సంజీవకుమార్

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 19 పీజీ సీట్లు, 179 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు రావడానికి కృషి చేశానన్నారు. ప్రజలకు తక్కువ ధరలో జన ఔషధి స్కీమ్‌ను జిల్లాలో గ్రామ స్థాయిలో పెట్టించాలని ప్రయత్నం చేసినా ప్రభుత్వం సహకరించలేదన్నారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ సదస్సులో సౌత్ ఇండియా అధ్యక్షుడు డా.అభయ్ మట్కర్, వైస్ ప్రెసిడెంట్ ఉమాశంకర్, కార్యదర్శి డా.లోకేశ్వరరెడ్డి, సీఎంఈ చైర్‌పర్సన్ పీఎస్‌వీఎన్ శర్మ, ఏపీఎంసీ అబ్జర్వర్ డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా.బి.రమేష్‌బాబు, సెక్రటరీ డా.కే నాగిరెడ్డి, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలు డా.హరిప్రసాద్, డా.సుహృత్ రెడ్డి, సైంటిఫిక్ కన్వీనర్ డా.శివశంకర్ రెడ్డి, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఏపీ రాష్ట్రాల నుంచి వైద్యులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన వైద్యులు



టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే విజయం
- అంచనాలు వేసిన మెజార్టీ సర్వే సంస్థలు
- జిల్లాలోనూ సత్తా చాటనున్న తెలుగుదేశం

కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మే 13న ఓటర్లు తీర్పు ఇచ్చారు. అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎం యంత్రాల్లో నిక్షిప్తమై మూడంచెల భద్రత వలయంలో స్ట్రాంగ్ రూంల్లో భద్రంగా ఉన్నాయి. ఇప్పటి వరకు అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీ నాయకులు అంచనాలతో కుస్తీపట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగాపోలైన ఓటర్ల వివరాలు తెప్పించి లెక్కలేసి మాదే గెలుపు అంటూ టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. నేటి నుంచి నాలుగవ రోజు అంటే మంగళవారం మధ్యాహ్నం 12 గంటల్లోగా విజేత ఎవరు..? పరాజితులు ఎవరు..? తేలిపోనుంది. శనివారం సాయంత్రం ఆరు గంటల తరువాత వివిధ సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ బరిలో ఉన్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల ముఖ్యనాయకుల్లో ఉత్కంఠకు తెర తీశాయి. పదుల సంఖ్యలో సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందో..? ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలవబోతుందో..? ఎన్ని పార్లమెంట్ స్థానాల్లో గెలువబోతుందో..? అంచనాలు వేసి ఎగ్జిట్ పోల్స్ ప్రజల ముందు ఉంచారు. మెజార్టీ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు టీడీపీ సారథ్యంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి. ఇది టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఇవి ఎగ్జిట్ పోల్స్ కాదు.. ఎగ్జాట్ పోల్స్. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తినబోయే ముందు రుచి ఎందుకు.. జూన్ 4న కూటమికి అనుకూలంగా ప్రజల తీర్పు రాబోతుందని ఆయన అన్నారు. అదే క్రమంలో కొన్ని సంస్థలు మళ్లీ వైసీపీనే ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని వెల్లడించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఉత్సాహం కనిపించింది.

మెజార్టీ స్థానాలు టీడీపీకే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, కర్నూలు పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 1994, 1999 ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటిన టీడీపీ ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 3-4 సీట్లకే పరిమితమైంది. 2019 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఓటమి చవి చూసింది. క్లీన్‌స్వీప్ విజయం అందించినా జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం. ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. అదే క్రమంలో ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మే 13న జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు టీడీపీ కూటమికి అనుకూలంగా మారింది. జిల్లాలో రికార్డు స్థాయిలో 76.42 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో టీడీపీ సత్తా చాటి 1999 నాటి విజయాన్ని సొంతం చేసుకుంటామని టీడీపీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. సర్వే సంస్థల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 6-8 స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని అంచనాలు వేస్తున్నాయి. మెజార్టీ స్థానాలు టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే.. ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకు పైగా విజయం సాధిస్తామని, కొన్ని ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు అదే విషయం వెల్లడిస్తున్నాయని వైసీపీ నాయకులు పేర్కొనడం కొసమెరుపు.

మూగజీవాల ఎరువే పంటకు ప్రాణం

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: నేరసారం పెంచేందుకు మూగ జీవాల ఎరువు ఎంతగానో ఉపయోగపడుతుందని, గొర్రెలు, మేకలు, కోళ్లు, కంపోస్టు, సేంద్రియ ఎరువులు పంటలకు ప్రాణప్రదమని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి స్పష్టం చేశారు. గొర్రెలు, మేకల మూత్రంలో పీహెచ్ విలువ 7.7 ఉంటుందని, దీని ద్వారా చౌడుభూములు సారవంతమవుతాయని అన్నారు. ఒక లీటరు మూత్రంలో 3 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్పరస్ మొదలైన మూలకాలు ఉంటాయని జేడీ తెలిపారు. ఒక గొర్రె ద్వారా ఒక రాత్రికి లీటరు మూత్రం 360 నుంచి 540 గ్రాముల పేడ లభిస్తుందని, మేకలు 900 గ్రాముల వరకు పేడను విసర్జిస్తాయని, వీటి ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు బ్యాక్టీరియా ప్రోటోజోవా ఫంగీ మొదలైన ఉపయోగకరమై సూక్ష్మజీవులు ఉత్పత్తయి నేల సారవంతమవుతుందని జేడీ వివరించారు. జీవాల మందను పొలాల్లో కూర్చోబెట్టడం ద్వారా రసాయనక ఎరువుల వినియోగం అవసరం ఉండదని, పంట పూర్తయ్యాక నెల రోజుల పాటు గొర్రెల మందను పొలంలోనే ఉంచడం వల్ల రైతుకు రూ.10 నుంచి 15వేల దాకా ఖర్చు తగ్గుతుందన్నారు.

రబీ పంట నష్టం రూ.58.28 కోట్లు

- 57వేల హెక్టార్లలో పంటలు మట్టిపాలు
- ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: ఈ సంవత్సరం రబీ సీజన్‌లో అనావృష్టి వల్ల కర్నూలు జిల్లాలో 18 మండలాల్లో సాగు చేసిన 57,677.62 హెక్టార్లలో సాగైన పంటలు మట్టిపాలయ్యాయి. వీటికి సంబంధించి ప్రాథమిక నివేదికను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి రూ.71వేల కోట్ల పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికను అందజేశామని చెబుతున్నారు. అయితే ఫైనల్‌గా మళ్లీ సర్వే చేసి ఎంత నష్టం జరిగిందో సర్వే చేసి తుది లిస్టును తయారు చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారన్నారు. ఇందులో భాగంగానే తుది జాబితాలో 54,382 మంది రైతులు పంట నష్టానికి గురయ్యారనీ, వీరికి 57,677.62 హెక్టార్లలో సాగైన పంటలు నష్టపోయినట్లు గుర్తించి వారికి రూ.58.28 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేధికను కలెక్టర్ అనుమతితో పంపనున్నట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆదోని, కోడుమూరు, ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, గూడూరు, హోళగుంద, కోడుమూరు, కల్లూరు, మద్దికెర, ఓర్వకల్లు, మంత్రాలయం, వెల్దుర్తి, కర్నూలు రూరల్, అర్బన్ మండలాల రైతులు నష్టపోయారనీ, ప్రభుత్వం త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీని నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని జేడీ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 1: జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు మొత్తం 331 మంది, ఇంటర్ విద్యార్థులు 347 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో పది పరీక్షలకు 291 మంది విద్యార్థులు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు 308 మంది విద్యార్థులు హాజరు కాగా, 39 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈఓ శామ్యూల్ పర్యవేక్షించారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారీఖ్ ఆలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేశామని సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారీఖ్ ఆలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న వెలువడనున్న ఫలితాల నేపథ్యంలో కౌంటిగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ రిటర్నింగ్ అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. గత వైఫల్యాలు ఏమైనా జరిగి ఉంటే పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, ఆలూరు ఆర్వో రాము నాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ప్రభాకర్ రెడ్డి

కర్నూలు (హాస్పిటల్), జూన్ 1: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డా.సి.ప్రభాకర్ రెడ్డి శనివారం ఉదయం కలెక్టర్ డా.జి.సృజనను కలెక్టర్ చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి విషయాలపై ఇరువురు చర్చించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు డా.ప్రభాకర్ రెడ్డికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.

క్యాజువాల్టీ, ఏఎంసీకే తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

- వైద్యులు సమయపాలన పాటించాల్సిందే
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: అత్యవసర రోగులకు వైద్యం అందించే క్యాజువాల్టీ, ఏఎంసీ వార్డులకే అధిక ప్రాధాన్యం ఇస్తామని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్ కుమార్, ఆర్ఎంవో వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పెట్టిన క్యాజువాల్టీ (అత్యవసర విభాగం) అలాగే ఉందని, దీన్ని మార్పులు చేస్తామని చెప్పారు. క్యాజువాల్టీ పక్కన ఉన్న ఔషధాల క్యాజువాల్టీలో బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్‌ఎటాక్ రోగులకు వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ఏఎంసీ పక్కన ఉన్న మానసిక వ్యాధుల విభాగం ఓపీ కేంద్రంలో అదనపు ఏఎంసీని ఏర్పాటు చేసి ఐసీయూ పడకలను ఉంచుతామని వెల్లడించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల కల్చరల్/నంద్యాల క్రైం, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహిం చేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలో నందికొట్కూరు, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గాలు, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలో నం ద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి, అసెంబ్లీ నియోజకవర్గాలు, ఫార్మసీ కాలేజీలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబందించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 4వతేదీ ఉదయం 8గంటలకు పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు అనంతరం అరగంటకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి : ఎస్పీ

రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద 144వ సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్‌రోజు కళాశాల ప్రవేశద్వారం వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది కళాశాల లోపలికి వచ్చే ప్రతి ఒక్కరిని తనిఖీ చేస్తారన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఆర్జీఎం హాస్టల్ క్యాంపస్ ఆవరణలో కౌంటింగ్ కేంద్రాలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల కు చెందిన వాహనాలు మాత్రమే అనుమతిస్తామని ఎస్పీ వెల్లడించారు. కేశవరెడ్డి స్కూల్ ఆవరణలో శ్రీశైలం, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించిన వారి వాహనాలు పార్టీలవారీగా నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే బీసీ వెల్ఫేర్ స్కూల్ ఆవరణలో డోన్, బనగానపల్లె నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఎస్టీ వెల్ఫేర్ స్కూల్ ఆవరణలో డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వైసీపికి సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్లకు శిక్షణ



సూచనలు ఇస్తున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 1: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై శనివారం కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెం ట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన మాట్లాడుతూ కౌంటింగ్ నియమ నిబంధనల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్లు, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ఒకవేళ తీసుకుని వస్తే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్స్ వద్దే వాటిని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఈవీఎం కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఉంటాయని, పోటీల్లో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి కౌంటింగ్ సమయంలో తేడా ఉంటుందన్నారు. రౌండ్ల వారీగా ప్రతి రౌండు పోల్ వివరాలను గట్టిగా ఏజెంట్లకు వినపడేలా అభ్యర్థుల వారిగా చదవాలన్నారు. కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ ఆన్ చేసినప్పుడు డిస్‌ప్లే రాకపోతే ఆర్వోకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒకవేళ 17సీ, ఈవీఎంలో ఉన్న ఓట్లకు వ్యత్యాసం ఉంటే సంబంధిత ఆర్వోకు తెలపాలన్నారు. రౌండ్ల వారీగా సంతకం లేకపోతే కౌంటింగ్ కోసం రెండో మిషన్ ఇవ్వడం జరగదన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ముందు బ్యాలెట్ ఔటర్ కవర్ ఓపెన్ చేసినప్పుడు డిక్లరేషన్, బ్యాలెట్ ఉందా లేదా అని చెక్ చేయాలన్నారు. ఒకవేళ డిక్లరేషన్ లేకపోతే ఇన్‌వాలిడ్ అని, డిక్లరేషన్ ఉండి అందులో ఓటరు సంతకం ఉంటే వ్యాలిడ్ అని తెలిపారు. ఒక వేళ ఓటరు సంతకం లేకపోతే ఇన్‌వాలిడ్‌గా పరిగణించబడుతుందన్నారు. తర్వాత గెజిటెడ్ అధికారి సీల్, సంతకం ఉందా లేదా అని చెక్ చేసుకోవాలన్నారు. డమ్మీ పోస్టల్ బ్యాలెట్‌లను ప్రదర్శించి ఏది వ్యాలిడ్, ఏది ఇన్ వ్యాలిడ్ అని అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

నలుగురి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- పెళ్లికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం
- అంతా ఒక కుటుంబానికి చెందిన వారే..

ఆళ్లగడ్డ, జూన్ 1: ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా యర్రవల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన వెంకటేశ్వర్లు హైదరాబాదులో స్థిరపడ్డాడు. ఆళ్లగడ్డలో గత నెల 27, 28 తేదీలలో తన భార్య ఓబులమ్మ తమ్ముడి పెళ్లికి హాజరై తిరిగి హైదరాబాదుకు బయలుదేరారు. వీరు పయనిస్తున్న కారు యర్రవల్లి సమీపంలోకి రాగానే అక్కడే ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో వెంకటేశ్వర్లు (38), అతని భార్య ఓబులమ్మ (35), తల్లి లత(55), అక్క కొడుకు(8)ఆదిత్య దుర్మణం చెందారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్క కవిత, కొడుకు నందు, కూతురు ధరణిలు గాయపడ్డారు. వీరిని పోలీసులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేశారు. మృతదేహాలకు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం శనివారం ఆళ్లగడ్డకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెళ్లి పందిర్లు తొలగించక ముందే ఆ ఇంట ఎంత ఘోరం జరిగిందంటూ పలువురు విచారం వ్యక్తం చేశారు.

తెలంగాణ మద్యం సీజ్

కర్నూలు(అర్బన్), జూన్ 1: తెలంగాణ నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న 1,936 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. అక్రమ మద్యం తరలిస్తున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని ఆరు కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. 23 లీటర్ల సాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూన్ 1: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరే ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. రాయలసీమ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి శనివారం ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపారు. ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని రాయలసీమ హక్కులను ఇన్నేళ్లయినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 4న విడుదల చేసిన గెజిట్ వల్ల రాయలసీమ సాగునీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఈ నెల 10వ తేదీన సంగమేశ్వరంలో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవంలో రాయలసీమ ప్రజా సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

డిగ్రీలో 26 మంది డిబార్

కర్నూలు(అర్బన్), జూన్ 1: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో 26 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 2వ సెమిస్టర్‌కు 2,787కు 2,536, 6వ సెమిస్టర్‌కు 423 మంది దరఖాస్తు చేసుకోగా 383 మంది హాజరై పరీక్షలు రాశారు.

కౌంటింగ్ విధులకు 204 మంది

కర్నూలు(న్యూసిటీ), జూన్ 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే కౌంటింగ్ కోసం 204 మంది నగర పాలక సంస్థ, రెవెన్యూ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి రిటర్నింగ్ అధికారి ఏ.భార్గవతేజ విధులకు నియమించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, ఉద్యోగుల హాజరుపట్టిక, మొబైల్ డిపాజిట్ కేంద్రం నిర్వహణ, ఏజెంట్ల గుర్తింపు కార్డుల తనిఖీ, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ వరకు 137 కర్నూలు అసెంబ్లీ, 18 కర్నూలు పార్లమెంటుకు సంబంధించి ఈవీఎంలను తీసుకెళ్లడం, కౌంటింగ్ టేబుల్స్‌కు కావాల్సిన స్టేషనరి, మీడియా పాయింట్, పోస్టల్ బ్యాలెట్, జనరల్ అబ్జర్వర్‌కు నివేదికలు తయారు చేయడం, మీడియా పాయింట్, కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచడం కోసం సుమారు వీరిని నియమించారు. కౌంటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండ ముందస్తు చర్యలు తీసుకున్నారు.

తాగునీటి శాంపిల్స్‌ను పరిశీలించండి


నీటి నమూనాలను సేకరిస్తున్న డీఈ గోపాలకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూన్ 1: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అతిసారం ప్రబలుతున్న నేపథ్యంలో నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి రోజూ తాగునీటి శాంపిల్స్‌ను తీసుకుని పరీక్షలు జరపాలని కమిషనర్ ఎ.భార్గవతేజ ఆదేశించారు. శనివారం తాగునీటి సరఫరాపై వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజూ సచివాలయ కార్యదర్శులు క్షుణ్ణంగా నీటి పరీక్షలు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నీటి నమూనా పరీక్షలను పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్లోరినేషన్ శాతాన్ని, నీటి నాణ్యతపై సందేహాలు వస్తే వెంటనే ఆ నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం హెడ్ వాటర్‌వర్క్స్‌లోని ప్రత్యేక ల్యాబ్‌కు పంపాలన్నారు. నగర వాసులకు శుద్ధజలం అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

'పండ్ల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(న్యూసిటీ), జూన్ 1: నగరంలో రసాయనాలతో పండ్లను మాగబెడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాతబస్టాండు ప్రాంతములో వ్యాపారులు ఓ వైపు అధిక లాభార్జన కోసం నాసిరకం పదార్థాలు ఉపయోగిస్తున్నారని అన్నారు. మరోవైపు పండ్లను ఆకర్షణీయంగా కనిపించడం కోసం రంగు నీళ్లలో ముంచుతూ మాగబెడుతున్నారని తెలిపారు. ఇలాంటి పండ్లను తిన్నవారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారన్నారు. తక్షణమే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగన్న, శంకరమ్మ, శేషమ్మ, కర్రెమ్మ, షబానా తదితరులు పాల్గొన్నారు.

'డీఈవోపై విచారణ జరిపించాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 1: జిల్లా విద్యాశాఖ అధికారిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు శనివారం డిమాండ్ చేశారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షల తనిఖీలు నిర్వహించకుండా విద్యాసంస్థల యజమాన్యాల నుంచి రూ.లక్షలు ముడుపులు అందుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.10వేల నుంచి రూ.12వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. డీఈవోపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కె.నాగులాపురంలో డీఎంహెచ్‌వో పర్యటన

గూడూరు, జూన్ 1: కె.నాగులాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్ల గ్రామం అంగన్‌వాడీ సెంటరులో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పవీణ్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులకు వడదెబ్బకు గురవుతారని, సరైన వైద్య చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌పై సూచించిన విధంగా ఒక లీటర్ నీటిని బాగా వేడి చేసి చల్లార్చి నీటిలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని కలిపి తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీదేవి, సిబ్బంది ఈశ్వరయ్య, చంద్రయ్య, మీనా, మంజుల, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులకు అనుమతి లేదు

గూడూరు, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఊరేగింపులకు అనుమతి లేదని కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, కే.నాగులాపురం ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని కె.నాగులాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు

టీడీపీ గెలవాలని పూజలు


హుశేనాపురంలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జూన్ 1: మండలంలోని హుశేనాపురం గ్రామంలో శనివారం నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ కాపు సంఘం నాయకులు కేవీ మధు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి ఆకుపూజలు, ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు నాయుడు గెలవాలని, అలాగే పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అత్యధిక మెజారిటీతో గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


సత్రం రామకృష్ణుడుని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 1: పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఎంపీ సంజీవ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడుని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోకాళ్లకు మైక్రో సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, బేత క్రిష్ణ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

కర్నూలు(కల్చరల్), జూన్ 1: వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకొని కర్నూలు జిల్లాలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వైష్ణవ దేవాలయాలు, రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

● నగర శివారు గుత్తి హైవే సమీపంలోగల జగన్నాథగట్టుపై వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. మహిళలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. దేవస్థానం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇ.మల్లికార్జున రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

● టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్నూలు మండలం ఇ.తాండ్రపాడులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన వేడుకలకు నాగలింగేశ్వర మఠాధిపతి ఎల్లప్పస్వామి, ఇస్కాన్ ధర్మ ప్రచారకుడు రఘునందన్ సేవక్ దాస్‌జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, అర్చకులు శ్రీరాములు, తూర్పాటి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చనలు, ఆకుపూజలు నిర్వహించారు.

● బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వేకువ జాము నుంచి ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు చేపట్టారు. భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

● పాతనగరంలోని శ్రీరామాలయంలో, కుమ్మరి వీధి, బుధవారపేట, బంగారుపేట, వీఆర్ కాలనీల్లోని హనుమాన్ ఆలయాల్లో, వన్‌టౌన్, అశోక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో, షరీన్ నగర్‌లోని సద్గురు త్యాగరాజ రామాలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు.

గోశాలలో: నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నగరంలో కిడ్స్ వరల్డ్ సమీపంలోని జిల్లా గో సంరక్షణశాల (గోశాల)లో జరిగిన హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా సాగాయి. గోశాలలో భారీ హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తిని పల్లకిలో ఊరేగించారు. సమితి అధ్యక్షుడు కె. క్రిష్ణన్న, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, మహాబలేశ్వర్, కార్యదర్శి నాగోజీరావు, గోపీనాథ్, నటేష్‌కుమార్, కల్కి మురళి, రమేష్, మల్లికారున పాల్గొన్నారు.

గోదా గోకులంలో.. నగర శివారు మామిదాలపాడులోని గోదా రంగనాథస్వామి (గోదాగోకులం) క్షేత్రంలో శనివారం హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు చేశారు. అనంతరం మన్యుసూక్త హోమము చేపట్టారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలంలోని గోవర్దనగనర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి, ముజఫర్‌నగర్, పందిపాడు, శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు.


వెంకటగిరిలో గిడ్డాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

● పందిపాడులో వెలసిన గోడల హనుమంతరాయుని ఆలయంలో హనుమజ్జయంతిని ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం స్వామివారికి కుంకుమ అర్చన, ఆకుపూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం, ఊయల సేవను చేపట్టారు.

● గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో టి.శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సమక్షంలో అన్నదాన ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా గిడ్డాంజనేయస్వామి రథోత్సవం

కోడుమూరు(రూరల్): మండలంలోని వెంకటగిరిలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం గిడ్డాంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కలశాన్ని తలపై మోస్తూ రథం వరకు తీసుకొచ్చారు. అక్కడ పూజరులు కలశాన్ని రథానికి అలంకరించారు. సాత్విక బలిదానంగా టెంకాయలు, గుమ్మడికాయలు సమర్పించారు. అనంతరం భక్తులు రథాన్ని ఎదురు మండపం వరకు లాగి తిరిగి రథశాల వద్దకు చేర్చారు. అలాగే ముడుమలగుర్తిలో ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతా భిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు మధు, రాణి దంపతులు అన్నదానం చేశారు. వర్కూరులో ఆంజనేయస్వామికి అభిషేకం, హోమం, పల్లకిసేవ, అన్నదానం చేశారు.

గూడూరు: గూడూరులో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

ఓర్వకల్లు: మండ లంలోని ఓర్వకల్లు, కొమ్ముచెరువు, కాల్వ, హుశేనాపురం, కన్నమడకల, భైరాపురం, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమ యాజులపల్లె, కొమరోలు, కాల్వబుగ్గ తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.




రథోత్సవంలో పాల్గొన్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గోవర్ధననగర్‌లోని పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో పూజలు, జగన్నాథగట్టుపై వెలసిన అభయాంజనేయస్వామి మహా విగ్రహం


జగన్నాథ గట్టుపై అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు


హనుమాన్‌చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు


ఇ.తాండ్రపాడులోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రవచనాన్ని బోధిస్తున్న ఇస్కాన్ బాధ్యుడు రఘునందన్ దాస్‌జీ


ఓర్వకల్లులో ..


గూడూరులో..

ఏఎంసీలో అల్ట్రాసౌండ్, టూడీ ఏకో మిషన్ ప్రారంభం


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: అత్యవసర రోగులకు చికిత్స అందించే అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో కొత్తగా ఏర్పాటు చేసిన అల్ట్రాసౌండ్, టూడీ ఎకో మిషన్‌ను శనివారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ రోగులు అల్ట్రాసౌండ్, గుండె పరీక్షలకు ఇబ్బంది పడకుండా ఈయంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీలో మరణాల శాతాన్ని బాగా తగ్గించాలని, ఇం దు కోసం వైద్యులు రౌండ్స్ వేయాలని సూచించారు. త్వరలో 25 పడకలతో స్కిన్, మానసిక వ్యాధుల ఓపీల స్థానం మరో ఏఎంసీని ఏర్పాటు చేస్తామని, ఇందు కోసం ఓ దాత ముందుకు వచ్చారని వివరించారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ ఇక్బాల్ హుశేన్, ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మీబాయి, విద్యా సాగర్, ఏఎంసీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ సోమప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సూర్యకళ, రామయ్య, వలిబాషా, ఆర్ఎం వో వెంకటరమణ పాల్గొన్నారు.

యువతకు బజరంగ్ దళ్ మార్గదర్శకం


ప్రసంగిస్తున్న గుమ్మళ్ల సత్యం

కర్నూలు(కల్చరల్), జూన్ 1: యువతకు బజరంగ్ దళ్ మార్గదర్శకమని వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మహామంత్రి గుమ్మళ్ల సత్యం అన్నారు. నగరంలోని గుత్తిరోడ్డులోని ఇండస్ పాఠశాల్లో కొనసాగుతున్న బజరంగ్ దళ్ దక్షిణాంధ్ర శౌర్య ప్రశిక్షణా శిబిరం ఆరో రోజు శనివారం నగరంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, నగర ప్రముఖులతో జరి గిన 'సార్వ జనికోత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ దేశ ప్రగతినైనా నిర్దేశించేది యువతేనని, ప్రపంచంలో అత్యధికంగా యువత కలిగిన దేశంగా భారత్ ప్రపంచాన్ని శాసించబోతోందని చెప్పారు. వ్యసనాల బారిన పడిన యువతను మంచి మార్గంలో తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. వీహెచ్‌పీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు గోరంట్ల రమణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ శిక్షణలు పూర్తి చేసుకున్న యువత తమ తమ ప్రాంతాల్లో బజరంగ్ దళ్ లక్ష్యాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఇందులో భాగంగా యువత ప్రదర్శించిన కరాటే, కర్రసాము, షూటింగ్, లాఠీ ప్రయోగం, స్వీయ రక్షణ యుద్ధ విద్యలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సందడి మహేష్, మాళిగి భానుప్రకాశ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి, కోకన్వీనర్ పి.సందీప్, నాయకులు పెంచల్‌రెడ్డి, నీలి నరసింహ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: పాణ్యం ఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 1: పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాణ్యం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శనివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఇంజనీరింగ్ బ్లాక్‌లోని కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియా సెంటర్‌ను జేసీ సందర్శించారు. నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గానికి సంబం ధించి కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 26 రౌండ్లలతో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. జేసీ వెంట కల్లూరు తహసీల్దార్ మునివేలు ఉన్నారు.

72 శాతం పింఛన్ల పంపిణీ

సి.బెళగల్, జూన్ 1: మండల వ్యాప్తంగా 72 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. మండలంలో మొత్తం 3,241 మంది లబ్ధిదారులు ఉండగా అందులో 1,500 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో పింఛన్లను జమ చేశామన్నారు.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, జూన్ 1: సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లలదొడ్డి, పొలకల్లు గ్రామాల్లోని సచివాలయా లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 1: నగరంలోని కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో క్రీడాభారతి కర్నూలు జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు రాష్ట్ర పరిశీలకుడిగా క్రీడాభారతి ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్త కార్యదర్శి సురేంద్ర వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా డి.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా టి.నాగేశ్వరి, కోశాధికారిగా యోగా చార్య అవినాశ్ శెట్టి, ఉపాధ్యక్షులుగా పి.కోదండరామయ్య, ఎస్.శివ ప్రసాద్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా వజ్రరాజు, డా.ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా షేక్ దివాన్, శ్రీనివాసులు, ఈశ్వర్ నాయుడు, ఝాన్సీ, దస్తగిరమ్మ, అమరేష్‌లను ఎన్నుకున్నారు.

రాయితీపై ఎరువులు అందించాలి

కల్లూరు, జూన్ 1: అర్హులైన రైతులందరికీ 90 శాతం రాయితీపై ఎరువులు, విత్తనాలు అందించాలని కల్లూరు మండలం రైతుసంఘం అధ్యక్షుడు ఎ.క్రిష్ణ డిమాండ్ చేశారు. శని వారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ.క్రిష్ణ మాట్లాడుతూ మూడేళ్ల గా వర్షాలు కురవక నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఆర్‌బీకే కేంద్రాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కే.మధు, భాస్కర్‌రెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: మలేరియా వ్యతిరేక మాసోత్సవం (జూన్ 1 నుంచి 30) సందర్భంగా శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ మాసోత్సవాల్లో మలేరియా గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవా రం ఫ్రైడే-డ్రైడే నిర్వహించి దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, డెమో ప్రమీలమ్మ, ఈఈవో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌వో హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


విద్యార్థిని అభినందిస్తున్న అధినేత జి.పుల్లయ్య

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 1: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పేర్కొన్నారు. ఈశ్వరాస్ ట్యూటోరియల్స్ ఆధ్వర్యంలో స్థానిక బిర్లాగేటులోని కోచింగ్ సెంటర్‌లో ఏపీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష, పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో, బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల ప్రవేశాల పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈశ్వరాస్ ట్యూటోరియల్స్ గౌరవ సలహాదారుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ తమ సంస్థ నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ కళాక్షేత్ర అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ఆంగ్ల ఉపన్యాసకులు సునీతారోజ్, రవీంద్ర విద్యాసంస్థల డీన్ మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్, సుందరయ్య స్ఫూర్తి కేంద్ర కన్వీనర్ జేఎన్ శేషయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జస్టిస్ నాగార్జునరెడ్డిని కలిసిన వినియోగదారుల కమిషన్ చైర్మన్


రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్‌కు పూలమొక్క ఇస్తున్న కరణం కిషోర్ కుమార్

కర్నూలు(లీగల్), జూన్ 1: ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరి అథారిటీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డిని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జస్టిస్ నాగార్జునరెడ్డికి పూలమొక్కను అందజేశారు. ఆయనతోపాటు కమిషన్ సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, ఎస్.నజీమా కౌసర్ ఉన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు బాలుర జట్టుకు రజతం

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 1: తిమ్మాపురం (భీమిలి)లోని విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్లే గ్రౌండులో శనివారం జరిగిన 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ బాలికల విభాగంలో అనంతపురం బాలుర విభాగంలో నెల్లూరు జట్లు చాంపి యన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. కాగా బాలుర విభాగంలో కర్నూలు జట్టుకు రెండో స్థానంలో రజిత పతకం కైవసం చేసుకుంది. విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య, వేదాంత సంస్థ వ్యవస్థాపకుడు రాజశేఖర్, ప్రకృతి విద్యాసంస్థలకు ట్రోఫీలతోపాటు పతకాలను అందజేసి క్రీడాకారులను అభి నందించారు.

● బాలుర విభాగంలో అనంతపురం, కర్నూలు, తూర్పుగోదావరి జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందాయి.

● బాలికల విభాగంలో అనంతపురం, గుంటూరు, ఈస్ట్ గోదావరి జట్లు మొదటి, రెండు, మూడు స్థానాల్లో గెలుపొందాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ రగ్బీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్ కుమార్, కిషోర్ కుమార్, విజ్ఞాన్ స్కూల్ ఏవో సురేష్ పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 1: అనారోగ్య కారణాలతో ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ను ఎత్తివేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో పీవో, ఏపీవోలుగా తదితర ఎన్నికల విధులు ఉపాధ్యాయులకు డ్యూటీ వేశారని, కొంతమంది అనారోగ్య కారణాల వల్ల, చంటి పిల్లల తల్లులు ఇతర కారణాల వల్ల హాజరు కాలేదని పేర్కొన్నారు. అలాంటి వారిపై సస్పెన్షన్ విధించడం మంచిది కాదని, మానవతా దృక్పథంతో సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. నాయకులు సుంకన్న, గోపాల్, రామాంజనేయులు, సుధాకర్, షేక్షావలి పాల్గొన్నారు.

వైభవంగా గౌరయ్యస్వామి 39వ ఆరాధన

మద్దికెర, జూన్ 1: స్థానిక ఎస్సీ కాలనీ శివారులో గౌరయ్య స్వామి 39వ ఆరాధన మహోత్సవాలు అన్నపూర్ణ అతివర్ణ ఆశ్రమంలో వైభవంగా జరిగాయి. ఉదయం గౌరయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భరద్వాజపీఠం వెంకటదాసు స్వామివారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు భక్తి ప్రవచనాలు జరిగాయి. ఈ సందర్భంగా శనివారం ఆశ్రమంలో శ్రీనివాసాచార్యులు ఆంజనేయస్వామివారు, రామచంద్రారెడ్డి, సింగాపురం రంగన్న, రామాంజనేయులు, సుంకయ్య, వెంకటరెడ్డి, తదితరులు భక్తులకు ప్రవచనాలను వినిపించారు.

చదరంగంలో రాణించిన సానియా

మద్దికెర, జూన్ 1: మండలంలోని హంపా గ్రామానికి చెందిన పోలికి బషీర్, షబానా దంపతుల కుమార్తె సానియా 2వ తరగతి చదువుతూ.. చదరంగంలో ప్రతిభను చాటుతోంది. గుంతకల్లు పట్టణంలోని మండిబజారు కాలనీలోని పెంగ్విన్ యాక్టివిటీ క్లబ్ ఆధ్వర్యంలో అండర్-15 చదరంగం పోటీలు నిర్వహించారు. సానియా ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసలు పొందారు. నిర్వాహకులు నాగార్జున మాట్లాడుతూ బాలబాలికల మెదడుకు పదును పెట్టే శక్తి చదరంగానికే ఉందని, అందువల్ల ఈ పోటీలు నిర్వహించామని ఆయన తెలిపారు.

రాతిదూలం పోటీలు పల్లె సంస్కృతికి నిదర్శనం

మద్దికెర, జూన్ 1 : గ్రామీణ ప్రాంతాల్లో జాతరలకు, పండుగలకు నిర్వహించే రాతిదూలం పోటీలు పల్లె సంస్కృతికి నిదర్శనమని మండల వైస్ ఎంపీపీ కాకర్ల మహేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు ఆకుల ఆనంద్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శనివారం మండలంలోని పాడురామకృష్ణాపురంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించారు. 8 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా.. గాజులపేట గ్రామానికి చెందిన పసుపులేటి రమణయ్య రూ.30వేలు మొదటి బహుమతిని దాత ఆకుల ఆనంద్ అందజేశాడు. రెండో బహుమతి వెంగన్నపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జునకు రూ.20వేలు నగదును దాత శివానంద, మహేశ్వరరెడ్డి అందజేశారు. మూడో బహుమతి జొన్నగిరి గ్రామానికి చెందిన నెల్లూరప్పకు రూ.10వేలు వాల్మీకి యూత్ అందజేశారు. అలాగే నాలుగు, ఐదు బహుమతులను వడ్డెబాలు, భాస్కర్, గోవిందులు అందజేశారు.

ఫొటో గోనెగండ్ల 5. గోనెగండ్లలో సబ్సిడీ విత్తనాలను రైతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

గోనెగండ్ల, జూన్ 1: సబ్సిడీ కింది వేరుశనగ విత్తనాలను తీసుకున్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏవో హేమలత కోరారు. శనివారం మండల పరిధిలోని ఆర్బీకేలలో రైతులకు సబ్సిడీ కింద వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలంకు 275 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చాయని విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. విత్తనాలు పొంది పంట సాగు చేయకున్నట్లు క్షేత్రస్థాయిలో తెలితే ఇక వచ్చే ఏడాది వారికి సబ్సిడీ విత్తనాలు ఇవ్వడం కుదరదని తెలిపారు. కావున విత్తనాలు పొందిన ప్రతి రైతు సాగు చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నందవరం, జూన్ 1: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారి మహ్మద్ఖాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన విత్తనాలను, మందులను రైతులకు అందించాలన్నారు. రిషిప్టలు రైతులకు తప్పని సరిగా ఇవ్వాలని తెలిపారు. అనంతరం నందవరం ఆర్బీకెలో వ్యవసాయ అధికారి స్రవంతి ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఈవో సురేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్‌లు


గోనెగండ్ల జూన్ 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్ లను అందజేస్తామని ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ తెలిపారు. శనివారం విద్యాకానుక కిట్‌లు గోనెగండ్లకు చేరినట్లు వారు తెలిపారు. మండలంలో 55 పాఠశాలలో 10,691 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వచ్చిన కిట్‌లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భద్రపరిచామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవిందరాజు,రవి, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి

గోనెగండ్ల, జూన్ 1: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీసీఈవో నారసరెడ్డి కోరారు. శనివారం గోనెగండ్ల మండల పరిధిలోని ఎస్ఎస్ ట్యాంక్‌లు ఉన్న అలువాల, గోనెగండ్ల గ్రామాలలో ఆయన పర్యటించారు. ట్యాంక్ ల దగ్గర ఉన్న ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలించారు. అలువాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి 9 గ్రామాలకు నీరు అందుతుందని, గోనెగండ్ల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి గోనెగండ్ల, ఐరన్‌బండ గ్రామాలకు నీరు సరఫరా అవుతుందని అధికారులు సీఈవో కు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్‌డీ నాగేష్, సతీష్, కాంట్రాక్టర్ మురళినాయుడు , అడ్వకేట్ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కలే... లెక్కలు

● ఫలితాలపై అభ్యర్థుల తర్జనభర్జన
● కూడికలు తీసివేతల్లో బిజీబిజీ
● ఏమి జరుగుతుందోనని గుబులు
● 4వ తేదీ వరకు హైటెన్షన్



ఆదోని, జూన్ 1: పోలింగ్ ముగిసి 21 రోజులు పూర్తయిన నేపథ్యంలో అభ్యర్థులు లెక్కల్లో బీజీబీజీ అయ్యారు. అనుచరులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరుపుతూనే ఉన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ లీడ్ వస్తుంది..? ఎక్కడ చేజారిపోతుంది..? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉదాహరణకు ఒక బూత్‌లో 900 వరకు ఓట్లు పోలైతే.. అందులో 50 శాతం ఓట్లనే పరిగణలోకి తీసుకుని లెక్కలు కడుతున్నారు. బూత్‌ల వారిగా కేటాయించిన డబ్బు ఓటర్లకు పూర్తిస్థాయిలో చేరిందా...? ఒక వేళ తీసుకున్న వారితో ఎంతమంది మనకు వేసి ఉంటారు.. తీసుకున్నా ఎవరు వేయలేదు..? అనే అంశాలపై ద్వితీయ శ్రేణి నాయకులతో మాట్లాడారు. ఒక్కో ప్రాంతంలో 80 శాతం ఓట్లు తప్పకుండా పడుతాయని నాయకులు నమ్మకంగా చెబుతున్నా.. అభ్యర్థులు మాత్రం ప్రతి చోటా 50 నుంచి 60 శాతానికి లెక్కలు వేసుకుంటున్నారు. మొత్తం పోలైన ఓట్లలో ఇదే విధంగా చూసుకుని గెలుపుపై అంచనాలను సరిచూసుకుంటున్నారు.

● కొంత ఊరట.. మరికొంత దడ..

గెలుపుపై నాయకులు, కార్యకర్తలు చెబుతున్న మాటలతో అభ్యర్థులు కొంత ఊరట పొందుతున్నారు. ఇదే సమయంలో ఫలానా చోట నాకు తక్కువే వస్తాయి కావచ్చు.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తుండడంతో, మరికొంత గుబులు చెందుతున్నారు. డబ్బు తీసుకున్నా.... అక్కడి వారు ఎదుటి పార్టీ అభ్యర్థికే ఓట్లు వేసినట్లు తెలియవచ్చిందని చెబుతుండడంతో పరేషాన్ అవుతున్నారు. గెలుపే లక్ష్యంగా నోట్ల వర్షం కురిపించినా, చాలా ప్రాంతాల్లో తక్కువ ఓట్లు వస్తున్నాయని తెలుస్తుండడంతో ఒణికిపోతున్నారు. పోలింగ్ అనంతరం ఎక్కడికి వెళ్లినా.. తనకే ఓట్లు పడ్డాయని సంకేతాలు రావడంతో ఆనందంలో మునిగిపోయిన ఆయన, ఇటీవల ఆదోని టౌన్ ఓటర్లు మూడో వ్యక్తిని కోరుతున్నారని, అందుకే పట్టణ ప్రాంతంలో తనకు ఓటర్లు షాక్ ఇచ్చారన్నది తెలియరావడంతో అంతర్మథనంలో పడినట్లు తెలిసింది. దాదాపు లక్ష మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేసిన సదరు అభ్యర్థి, 50వేలు మెజారిటీ వస్తుందని సరిపుచ్చుకొని, తీరా ఓటర్లు డబ్బులు తీసుకుని మూడో వ్యక్తిని కోరుకుంటున్నట్లు తెలుసుకున్న ఆయన, తాజాగా ఒక వెయ్యి మెజారిటీ వచ్చినా చాలనే అభిప్రాయాన్ని నేతల వద్ద వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

● 4వ తేదీ మధ్యాహ్నం వరకు హై టెన్షన్..

పోటీచేసిన అభ్యర్థులకు 4వ తేదీ మంగళవారం మధ్యహ్నం వరకు హైటెన్షన్ తప్పని పరిస్థితి నెలకొంది. గెలుపు పై కొంతమందికి వంద శాతం నమ్మకం ఉన్నప్పటికీ.. ఈవీఎంలలో ఎలా ఉంటుందోనని హడలిపోతున్నారు.

ఫలితాల రోజు ఓవర్‌యాక్షన్ చేయెద్దు



ఆస్పరి, పత్తికొండలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతన్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ఆదోని రూరల్, జూన్ 1 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లువడుతున్నాయని, ఆ రోజు ఎవరు కూడా ఓవర్‌యాక్షన్ చేయొద్దని ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి హెచ్చరించారు. స్థానిక మహేశ్వరి కల్యాణ మండపంలో రూరల్ పరిధిలో ఉన్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలతో అత్యావసర సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, ఫలితాల రోజు ఏ పార్టీ నాయకుడుగాని, కార్యకర్తగాని అత్యుత్సాహం ప్రదర్శిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా గెలిచిన అభ్యర్థులను గెలవడానికి ఆదోనికి ఎవరు రాకూడదని, గ్రామాల్లో బాణసంచ కాల్చరాదని, డిజెలు నిర్వహించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో , రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి, ఎస్.ఐలు, శ్రీనివాసులు, పీరయ్య, ఎర్రిస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణ

మండలంలోని అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలతో పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాలలో, పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, పోలీస్ సిబ్బంది, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు...

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఆస్పరి: ఎన్నికల ఫలితాల అనంతరం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలు

పత్తికొండ టౌన్ : ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షలు నమోదు చేస్తామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీలతో స్థానిక సీఐ మురళి మోహన్‌తో కలిసి డీఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు, సిబ్బంది ఆల్కహాల్ సేవించినట్లయితే.. అలాంటి వారిని కౌంటింగ్ హాలులోకి అనుమతి ఉండదన్నారు. సమావేశంలో పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

వెల్దుర్తి, జూన్, 1 : వెల్దుర్తిలో విత్తన దుకాణాలను విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణలలో రిజిష్టర్లు, స్టాకు బోర్డులు, లైసెన్సులు, అనుమతి పత్రాలను, గోడౌన్‌లలో ఉన్న విత్తన నిల్వలను తనిఖీ చేశారు. బాలాజీ సీడ్స్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో స్టాకు రిజిష్టరులో నమోదు కాని ఆముదము, విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. వీటి విలువ సుమారు రూ.3లక్షల30 వేలు. విత్తనాలు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా లాట్ నెంబరు ఇతర సమాచారాన్ని కనబరచి రశీదు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకి మించి విత్తనాలు విక్రయించినా, అనుమతులు లేని విత్తనాలు రైతులకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు కేశవరెడ్డి, చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

ఆలూరు, జూన్ 1: పంచాయతీ పరిధిలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. బాబోయి దోమలు అనే కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన మలేరియా ఆదోని సబ్ డివిజన్ అధికారి మంజునాథ్, సచివాలయ సిబ్బంది శనివారం చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి డ్రైనేజీలు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే డ్రైన్‌లలో పిచికారీ చేసి బ్లీచింగ్ పౌడర్ జల్లారు

టెన్షన్.. టెన్షన్

● కౌంట్‌డౌన్ మొదలు
● జాతకాలు చూసుకుంటున్న బెట్టింగ్ రాయుళ్లు



గోనెగండ్ల, జూన్ 1: అభ్యర్థులు పడే ఆత్రుత కంటే బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇక రెండు రోజులే మిగిలి ఉన్నాయి. పెట్టిన పెట్టుబడి వస్తుందా లేక పోతుందా అని టెన్షన్‌కు గురువుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు తదితర పట్టణాలలో ఇప్పటికే లాడ్జింగ్‌ల్లో (జూన్ 4) కౌంటింగ్ రోజుకు రూములు బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. మరికొంతమంది జూన్ 4వ తేదీన తమ జాతక బలం ఎలా ఉంటుందో తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గాలకు పరిమితమైన బెట్టింగ్‌ల జోరు మండల, గ్రామ స్థాయిలకు కూడా పాకింది. గ్రామాల్లో డబ్బు ఉన్న వారు పట్టణాలకు వెళ్లి బెట్టింగ్ కాస్తున్నారు. ఏపీలో ప్రభుత్వం మారుతుందని బెట్టింగ్ కట్టిన వారికి రూ. లక్షలకు అదనంగా మరో రూ. లక్ష చెల్లిస్తామని బెట్టింగ్‌లు కాస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే మాజీ సీఎం చంద్ర బాబు నాయుడు పోటీ చేసి కుప్పం నియోజయవర్గం పై కూడా ఇక్కడ పందెం కాస్తున్నట్లు రూ. లక్షలకు అదనంగా రూ.లక్షన్నర ఇస్తామంటూ బెట్టింగ్ లు కాస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కర్నూలు ఎంపీ స్థానం పై పోటా పోటీగా పందెం సాగుతోంది. జిల్లా లో ఉన్న రెండు సామాజిక వర్గాల ఓట్లు వైసీపీ పార్టీకి బలమైన ఓటు బ్యాంక్‌గా ఉండేవి. అయితే మారిన రాజకీయ నేపథ్యం కారణంగా ఆ రెండు సామాజిక వర్గాలు టీడీపీ, వైసీపీ ఇరు పార్టీ లను కాదని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడంతో టీడీపీ అభ్యర్థి గెలుపు ఖాయమని పందెం కాస్తున్నారు. పందెం నిర్వాహకుల దగ్గర ముందస్తు ష్యూరిటీగా చెక్కులు సమర్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.56 లక్షలు

కౌతాళం జూన్ 1: మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను శనివారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.55,61,130, అన్నదాన హుండీ 1,13,207, బంగారం 13గ్రాముల, 700మిల్లి గ్రాములు, వెండి 11.49కిలోలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్ ఆలయ పాలక మండలి సభ్యులు విజయేంద్ర రెడ్డి, నరసింహులు, రెడ్డి గీత, లక్ష్మిరెడ్డి, నరసమ్మ, రమణి, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

గుంపులుగా ఉంటే చర్యలు

పత్తికొండ టౌన్, జూన్ 1: పత్తికొండ పట్టణంలో హోటళ్ల వద్ద ఎవరైనా గుంపులు గుంపులుగా ఉండి రాజకీయాల గురించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని సీఐ మురళి మోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రధాన కూడలి నాలుగు స్తంభాల కూడలి వద్ద ఉన్న హోటళ్ల యజమానులను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెల6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రశాంతంగా ఉండి సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

పంట ఇన్సూరెన్స్ డబ్బు వెంటనే జమ చేయాలి

ఆలూరు రూరల్, జూన్ 1: పంట నష్టపోయిన రైతులకు సకాలంలో ప్రభుత్వం ఇన్సూరెన్స్ డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నారాయణ స్వామి, మండల కార్యదర్శి అగ్రహారం ఈరన్న అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కొంతమంది రైతులకు మాత్రమే ఇన్సూరెన్స్ డబ్బు పడ్డాయని , అందరికీ అందేలా చూడాలని కోరారు. నాయకులు షాకీర్, ఈశ్వర్ గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలు సీజ్

ఆదోని రూరల్, జూన్ 1 : మండల పరిధిలోని బసాపురం, నాగనాథనహళ్లి గ్రామాల్లో పోలీసులు అనుమానితుల ఇళ్లను తనిఖీ చేసి పత్రాలు లేని 45 వాహనాలను సీజ్ చేశారు. శనివారం రూరల్ సీఐ నీరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీఐ, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి రౌడీషీటర్, సస్పెక్టెడ్ ఇళ్లను సైతం తనిఖీ చేశారు.

వ్యక్తి పరిస్థితి విషమం

ఆదోని రూరల్, జూన్ 1 : పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ తిమ్మయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స కోసం కర్నూలు తరలించారు. శనివారం తెల్లవారు జామున బహిర్భూమికెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన మహేష్ ద్విచక్ర వాహనంతో వేగంగా తిమ్మయ్యను ఢీకొట్టాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు బంధువులు కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పీరయ్య తెలిపారు.

రెండెకరాలు పందెం కాసిన వ్యక్తిపై బైండోవర్ కేసు

మంత్రాలయం, జూన్ 1: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన బోయ బుజ్జల చిన్నోడు తనకున్న రెండెకరాలు (సుమారు రూ.50 లక్షలు) విలువ చేసే పొలాన్ని పందేనికి సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో బైండోవర్ కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. శుక్రవారం బోయ బుజ్జల చిన్నోడు సోషల్ మీడియా, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి గెలుపు ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని రెండెకరాల పొలాన్ని పందేం కాశాడు. దీంతో అతనితో పాటు సహకరించిన బోయ తిక్కన్న, బోయ ఈరన్నలపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ముందస్తు అరెస్టులు చేస్తామని ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

రాఘవేంద్రరెడ్డి గెలవాలని 50 కి.మీల పాదయాత్ర

మంత్రాలయం, జూన్ 1: మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి గెలుపును కాంక్షిస్తూ వి.తిమ్మాపురం టీడీపీ నాయకులు మాధవరం తిమ్మప్ప, గోపాల్, రమేష్, రాజు, రంగనాథ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. శనివారం గ్రామం నుంచి చెట్నపల్లి, మాధవరం, కర్ణాటకలోని గిలకసూగూరు క్యాంపు మీదుగా పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం వరకు 50 కి.మీ మేర పాదయాత్ర చేపట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నాసిరకం విత్తన విక్రయాలను అరికట్టండి

ఎమ్మిగనూరు, జూన్1: నాసిరకం విత్తనాల విక్రయాలను అరికట్టాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏడీఏ ఖాద్రీ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతకు నాణ్యమైన విత్తనాలు అందడంలేదని, కొంతమంది వ్యాపారులు తమ స్వప్రయోజనాల కోసం నాసిరకం విత్తనాలు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారని వీరికి కొంతమంది అధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన వెంటనే వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రాయతీ విత్తనాలను సైతం వెంటనే పంపిణీ చేయాలని, మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల విత్తనాలు ఆర్‌బీకేజీల ద్వారా రైతులకు అందజేయాలని కోరారు.

తోడుగా నిలిచిన స్నేహితులు



మిత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కోసిగి, జూన్ 1: తమతోపాటు పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యంతో బాధ పడుతుంటే సాటి మిత్రులు తోడుగా నిలిచారు. 2002-03 పదవ తరగతి పూర్వ విద్యార్థుల్లో ఒకరైన డి.బెళగల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు కురువ ఉరుకుందు వారం రోజులక్రితం హైబీపీకి గురై కాలు, చేతులు పడిపోయాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూలో ఉన్నాడని తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు రామక్రిష్ణ, చిదానంద, రామాంజనేయులు, దినేష్, హనుమంతు, ఉశేన్‌బాషా కర్నూలు వెళ్లి మిత్రుడు ఉరుకుందు ఆరోగ్య ఖర్చులకు రూ.30వేలు అందించారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఆదోనిలో రథోత్సవములో కళశాలతో ఊరేగింపులో డాక్టర్ పార్థసారథి, పగిడిరాయి, హంపగ్రామాల్లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదోనిలో 101 కళశాలతో రథోత్సవం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 1: పట్టణం శివారు ప్రాంతంలోని రణమండల కొండలోని ఆంజనేయస్వామి దేవాలయం, అంబేద్కర్‌నగర్ అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, గుడిసె కృష్ణమ్మ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అంబేద్కర్‌నగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి రథోత్సవాన్ని పురవీధులలో వైభవంగా చేపట్టారు. 101 మంది మహిళలు కళశాల చేత పట్టుకొని స్వామి వారిని ఊరేగించారు.



మంత్రాలయంలో ఆంజనేయస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

తుగ్గలి : మండలంలో మండలంలోని జొన్నగిరి, తుగ్గలి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పగిడిరాయిలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, మహామంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు.

మద్దికెర : మండలంలోని హంపా, పెరవలి, ఎం.అగ్రహారం, మద్దికెర గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆయా దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు హంపా గ్రామంలో రథోత్సవాన్ని నిర్వహించారు.